# మనం

## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

గురువారం - 15 - అక్టోబర్ - 2026 : పేజీలు 8




## శ్రీరామావతార అలంకరణలో దర్శనం ఇచ్చిన ఖాద్రీశుడు



**కదిరి, అక్టోబర్14 మనంన్యూస్:** శ్రీవారి ఆలయములో 11 నుండి 20 వరకు దశరా శరన్నవరాత్రి ఆలంకార మహోత్సవములు జరుగును. దశరా శరన్నవరాత్రి ఉత్సవములలో భాగంగా బుధవారం స్వామి వారు శ్రీ రామావతార అలంకరణలో భక్తులకు ఖాద్రీ నృసింహ స్వామి దర్శనము ఇచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి చర్యలు చెప్పట్టారు.

## అనంతపురం జిల్లా జడ్పీ చైర్మన్ రేసులో ఆవుల కృష్ణయ్య





**గార్లదిన్నె, అక్టోబర్ 14 మనంన్యూస్:** అనంతపురం జిల్లా రాజకీయాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించి చర్చలు జరుగుతున్న నేపథ్యంలో గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన ఆవుల కృష్ణయ్య పేరు ప్రస్తావనకు వస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్న ఆయన, ప్రస్తుతం అనంతపురం టీడీపీ బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసిన అనుభవంతో పాటు, ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ పార్టీ తరఫున గళమెత్తిన నాయకుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రాధాన్యం సంతరించుకుంది.

టీడీపీతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం...తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతున్న ఆవుల కృష్ణయ్యకు టీడీపీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ కార్యక్రమాల్లో తనదైన పాత్ర పోషిస్తూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

మిగతా 2లో

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

✦ 70మందికి రూ.31.43 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ✦ 28నెలల్లో 1,461 మందికి రూ.15.75 కోట్ల ఆర్థిక సాయం:మంత్రి సవిత

**పెనుకొండ అక్టోబర్ 14 మనంన్యూస్ :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా అరువ్వాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పరిధిలోని 70 మంది లబ్ధిదారులకు రూ.31,43,227 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు.





ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో గత 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదా రులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15.75 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయో జనాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. త్వరలోఅర్హులకు పింఛన్లు, గృహ వసతి కల్పిం చేందుకుకృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణా లను మెరుగుపరి చేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందనిమంత్రి వివరించారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య ,పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ దండు ఈశ్వర్ ప్రసాద్, త్రివేంద్రనాయుడు,కూటమి మండలనాయకులు, కార్య కర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యం : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 14 మనం న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులుగా విశేష సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ మొదటి రోజు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీ ఎస్. కుశల్ కార్తిక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీమతి ఆశ్రిత నౌపాడ, అనంతపురం జిల్లా ట్రెజరీ డీడీ, శ్రీ సత్యసాయి జిల్లా ట్రెజరీ డీడీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, పలువురు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగంలో విధులు నిర్వహిస్తున్న ప్రస్తుత ఉద్యోగులతో పాటు పదవీ విరమణ చేసిన సిబ్బంది తమ సర్వీసు కాలంలో ప్రభుత్వానికి అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని అన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ప్రతి శాఖ బాధ్యత అని పెన్షనర్ల సేవలను గుర్తించి ఆయా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో పెన్షన్ మంజూరు కోసం ఉద్యోగులు ఏజీ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. సీనియర్ సిటిజన్లను గుర్తించి, గౌరవిస్తూ ఏజీ కార్యాలయ అధికారులు క్షేత్రస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరఫున కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంతవరకు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండోరోజుకార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై తమ సమస్యల పరిష్కారానికి మార్గాలను పొందవచ్చని సూచించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పెన్షన్, జీపీఎఫ్ సేవలకు సంబంధించిన సందేహాలు, విధివిధానాలపై అవగాహన పెంపొందించుకుని తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని

మిగతా 2లో

# సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ సమావేశం

❍ పుట్టపర్తిలో స్థానిక ఎన్నికలపై సీనియర్ నేతల సమాలోచనలు

❍ తులసిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రఘువీరారెడ్డి, సుధాకర్, కోట సత్యం సహా పలువురు నేతల హాజరు




**పుట్టపర్తి, అక్టోబర్ 14 మనంన్యూస్ :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు పుట్టపర్తిలో పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, రఘువీరారెడ్డి, సుధాకర్, కోటా సత్యం తో పాటు వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో

మిగతా 2లో

## సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ సమావేశం

నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా స్పందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఎన్నికల సన్నద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు చర్చించారు. వివిధ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, నాయకులు మరియు కార్యకర్తల భాగస్వామ్యం, సంస్థాగత వ్యవహారాలపై దృష్టి సారించాల్సిన అంశాలను ప్రస్తావించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్యకర్తల మధ్య సమన్వయం ప్రాధాన్యతను వివరించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలను బలోపేతం చేసుకుంటూ రానున్న ఎన్నికలకు సిద్ధం కావాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది



## క్రీడలు మానసిక ఉల్లాసానిస్తాయి : తలారి దొడ్డప్ప



**గుంతకల్లు, అక్టోబర్ 13 మనంన్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని గెలుపు ఓటు సహజమని స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రముఖ సంఘ సంస్కర్త తలారి దొడ్డప్ప పేర్కొన్నారు. ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశం క్రికెట్లో ఎంతో ఎత్తుకు ఎదిగిందని పలుమార్లు ప్రపంచ కప్పును సాధించిందని క్రికెట్లో ప్రపంచ స్థాయిలో భారతదేశానికి ఎంతో పేరుంది అన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేతగా నిలిచిన జి టి ఎల్ విలన్స్ జట్టు కెప్టెన్ విష్ణుకు 4,016 రూపాయల నగదు భూమతిని తోపాటు ట్రోఫీలు కూడా అందజేశారు. రన్ రప్పుగా ని లిచిన సి ఎస్ ఎం జట్టు కెప్టెన్ వినాయకు 1,116 నగదు బహుమతితోపాటు రన్నర్ ట్రోఫీని అందించారు విజేత జట్టులోని పదం 11 మంది క్రీడాకారులకు మెడల్స్ ను అందజేశారు.

## పంచాయతీ రిజర్వేషన్లు

**ఆత్మకూరు అక్టోబర్ 14 మనంన్యూస్ :** ఆత్మకూరు మండలంలోని స్థానిక పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల అధికారులు గురించి సిగ్నల్ ఇచ్చి ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తుంది 17 పంచాయతీలకు రిజర్వేషన్లు క్రింది విధంగా ఉన్నాయి ఆత్మకూరు బీసీ జనరల్ వడ్డుపల్లి ఎస్సీ జనరల్ పంప నూరు జనరల్ ( మహిళ ) పి యాలేరు జనరల్ మహిళ ముట్టాలా జనరల్ పి సిద్ధరాంపురం జనరల్ సింగంపల్లి ఎస్సీ మహిళ గొ రుదిండ్ల జనరల్ సనప జనరల్ మహిళ తలుప్నరీరు జనరల్ మహిళ మదిగుబ్బ బీసీ మహిళ రంగంపేట బీసీ జనరల్ బి యాలేరు జనరల్ మహిళ తోపుదుర్తి జనరల్ మహిళ వేపచెర్ల ఎస్సీ జనరల్ వి ఈ తాండ ఎస్టీ జనరల్ లు రిజర్వేషన్ ఖరారు అయినట్లు సమాచారం నివేదిక అధికారికంగా రావాల్సి ఉంది

# స్థానిక ఎన్నికలకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలి

– అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి – జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం



**పుట్టపర్తి, అక్టోబరు 14 మనంన్యూస్ :** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛా యుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతా వరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం కీలకమని స్పష్టం చేశారు. పరిమిత సమయంలో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అధికారి తన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు.బుధవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ కొండయ్య, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ వెంకటరత్నం, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్‌కు అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ దశల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగనున్నందున అధికారులు ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా సమన్వ యంతో వ్యవహరించాలని పేర్కొన్నారు.రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం తొలుత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రెండో దశలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, మూడో దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ డిసెంబరు 2వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి దశకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అక్టోబరు 16న ఎన్నికల అధికారి నోటీసు జారీ, అక్టోబరు 18న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, అక్టోబరు 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబరు 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియనున్నట్లు వివరించారు. అక్టోబరు 28న పోలింగ్, అక్టోబరు 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరగనున్నట్లు తెలిపారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో అక్టోబరు 19న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబరు 23న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ కాగా, 24న నామినేషన్ల పరిశీలన చేపడతారని తెలిపారు. అక్టోబరు 25, 26 తేదీల్లో తిరస్కరించిన నామి నేషన్లపై అప్పీళ్ల పరిష్కారం, 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందని వివరి ంచారు. నవంబరు 3న పోలింగ్, నవంబరు 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయని తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడిం చారు. మొదటి విడత నవంబరు 26న, రెండో విడత నవంబరు 29న, మూడో విడత డిసెంబరు 2న పోలింగ్ జరగనుంది. జిల్లాలో ఏయే ప్రాంతాలను ఏ విడతలో చేర్చాలనే అంశాన్ని సంబంధిత అధికారులతో చర్చించి ఖరారు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు సంబంధించి రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యక్ష ఎన్నికల ప్రక్రియ అనంతరం సంబంధిత స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు.ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, కేంద్రాల ప్రకటన, వివిధ పదవులకు రిజర్వేషన్ల ఖరారు వంటి ముందస్తు ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ పెట్టెలు, పోలింగ్ సిబ్బంది నియామకం, రవాణా, భద్రతా ఏర్పాట్లు, సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండలపరిషత్అభివృద్ధి అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులు, పోలీసు శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు,పోలింగ్‌సమయంలో,ఎన్నికల అనంతరం చేపట్టాల్సిన ప్రతి కార్యక్రమానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూబాధ్యతాయుతంగా విధులు నిర్వహించా లని ఆదేశించారు.ఈసమావేశంలోఎన్నికల విధు లుకేటాయించినఆర్వోలు,ఈఆర్వోలు, ఏఏఆర్వోలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అనంతపురం జిల్లా జడ్పీ చైర్మన్ రేసులో ఆవుల కృష్ణయ్య

అనంతపురం జిల్లాలో పలు ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ టీడీపీ తరఫున వివిధ రాజకీయ అంశాలపై తన వాణిని వినిపించారు. పార్టీ విధానాలు, రాజకీయ పరిణామాలను మీడియా ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారు. ప్రతిపక్షంలో పార్టీ తరఫున గళమెత్తిన సందర్భాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ముఖ్యమైన ఘట్టాలుగా నిలిచాయి.

ఐదేళ్లపాటు వైస్ ఎంపీపీగా బాధ్యతలు...ఆవుల కృష్ణయ్య 2006 నుంచి 2011 వరకు వైస్ ఎంపీపీగా పనిచేశారు. స్థానిక సంస్థల పరిపాలనలో భాగస్వామిగా వ్యవహరించిన ఆయనకు మండల స్థాయి రాజకీయాలపై అనుభవం ఉంది. స్థానిక సంస్థల్లో బాధ్యతలు నిర్వహించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

కురువ సామాజిక వర్గానికి చెందిన బీసీ నాయకుడు:ఆవుల కృష్ణయ్య కురువ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ప్రస్తుతం టీడీపీ బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన బీసీ వర్గాలకు సంబంధించిన అంశాల్లో పార్టీ పరంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీసీ వర్గాల నుంచి ఆయనకు మద్దతు ఉందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

జడ్పీ చైర్మన్ పదవిపై ఆసక్తి...టీడీపీతో సుదీర్ఘ అనుబంధం, వైస్ ఎంపీపీగా పనిచేసిన అనుభవం, ప్రతిపక్షంలో పార్టీ తరఫున నిర్వహించిన ప్రెస్‌మీట్లు, ప్రస్తుతం జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న బాధ్యతల నేపథ్యంలో ఆవుల కృష్ణయ్య పేరు జడ్పీ చైర్మన్ పదవికి సంబంధించి చర్చకు వస్తోంది.మొత్తం మీద తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన, పార్టీ అభివృద్ధికి కృషిచేసిన ఆవుల కృష్ణయ్య కు టిడిపి హై కమాండ్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కట్టబెడుతుందో లేదో వేచి చూడాల్సిందే.

## పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ సూచించారు.సమస్యల పరిష్కారమే లక్ష్యం:అంతకుముందు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ మాట్లాడుతూ, ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పెన్షన్ పొందడం వారి హక్కు అని, ఆ ప్రయోజనాలను సక్రమంగా అందించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఏజీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమా లను చేపట్టినట్లు వివరించారు.పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులకు న్యాయం చేయడం, వారి సమస్యలను పరిష్కరించడం ఏజీ కార్యాలయ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెన్షన్, జీపీఎఫ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**అమడగూరు అక్టోబర్ 14 ( మనం న్యూస్ ):** మండల ఎస్సై గోపాలకృష్ణ,పుట్టపర్తి డీఎస్పీ గారితో కలిసి కొండకమర్ల సందర్శించి, గ్రామ ప్రజలకు పోలీసులకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చాము. ఈ కార్యక్రమంలో నేరాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల దుర్వి నియోగం, మహిళల భద్రత, రహదారి భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినప్పుడు పోలీ సులకు సమాచారం అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాము.అలాగే, రాబోయే ఎంపీటీసీ/జెడ్పీటీసీ మరియు గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాము. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలను కాపాడటం, రాజకీయ వర్గాల మధ్య ఘర్షణలు జరగకుండా చూడటం, ఓటర్లను ప్రభావితం చేయడానికి నగదు మరియు మద్యం పంపిణీ చేయకుండా నిరోధించడం, ఎన్నికలు ప్రశాంతంగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా సహకరించడం వంటి అంశాలపై వివరించాము. గ్రామంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని, చట్టాలను పాటించాలని గ్రామ ప్రజలకు సూచించాము.

# భవిష్యత్ తరాల కోసమే నాణ్యతా ప్రమాణాలు

– జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**అనంతపురం. అక్టోబర్ 14 మనంన్యూస్ :** భవిష్యత్ తరాల కోసం ప్రపంచం యావత్తు నాణ్యత ప్రమాణాలను పాటిస్తోందని అందులో భాగంగా మన దేశం సైతం అక్టోబర్ 14న అంతర్జాతీయ "మానక్ మహోత్సవ్"ను నిర్వహిస్తోందని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ స్పష్టం చేశారు. వరల్డ్స్ స్టాండర్డ్స్ డే పురస్కరించుకొని అనంతపురం జిల్లా వినియోగదారుల సేవా సంఘం ముద్రించిన చైతన్య పోస్టర్ ను బుధవారం ఆయన తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూఅంతర్జాతీయస్థాయిలో ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్, ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ వంటి సంస్థలు కలిసి ఈ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే ప్రతి ఏటా ఒక నినాదంతో ముందుకు సాగుతోందన్నారు.ఈ ఏడాది "షేర్డ్ విజన్ ఫర్ ఎ బెటర్ వరల్డ్ "నినాదంతో "మెరుగైన ప్రపంచం, భవిష్యత్ తరాల మనుగడ, స్వచ్ఛమైన నాణ్యతా ప్రమాణాల వృద్ధి కోసం ఈ దిశగా మనం పయనించాలని ఆయన గుర్తు చేశారు. ఇటీవలి కాలంలో పరిశ్రమలు,పెట్రోల్ డీజిల్ వాహనాలతో వెలువడే కాలుష్యం, ఒక ఎత్తయితే మరొకటి ప్లాస్టిక్ వినియోగమన్నారు. పంట పొలాలకు వినియోగించే రసాయనిక ఎరువులు పురుగుల మందులు విరివిగా వాడడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషణ జరగాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పటికి అనేక ప్రాంతాలలో ప్రత్యామ్నయంగా విండ్ పవర్, సోలార్ పవర్, హైడ్రోల్ పవర్, ప్రాజెక్టులను ఏర్పాటు చేసి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారన్నారు. పెట్రోల్ డీజిల్ కు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నారన్నారు.ఇటువంటి ఉత్పత్తులు సరసమైన ధరలో సరసమైన సేవలతో ప్రపంచ వ్యాప్తంగా అందరికీ అందుబాటులోకి రావలసినటువంటి అవసరము ఉందన్నారు.అందుకు మనం వినియో గించే ప్రతి వస్తువు నాణ్యమైన ప్రమాణాలు పాటిస్తూ, సురక్షితమైన ఉత్పత్తులు, నమ్మకమైన సేవలు, వాణిజ్యముతో సాధ్యమవుతా యన్నారు. ఇది మన అందరి మంచి భవిష్యత్తును నిర్మిస్తా యన్నారు. ప్రమాణాలతో ఉండవలసి నటువంటి అవసరం ఎంతైనా ఉందన్నారు.అందుకు ప్రపంచ వినియోగదారులుఏకంకావలసిన అవసరము ఉందన్నారు. కార్యక్రమంలో డిస్టిక్‌కన్స్యూమర్‌సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు భూపాలం సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్అంకె రామలింగమయ్య, ప్రధాన కార్యదర్శి పులుమతి భుజంగరావు పాల్గొన్నారు.

# రైతులకు కేబుల్ వైర్లు అప్పగింత



**గార్లదిన్నె అక్టోబర్ 14 మనంన్యూస్** : గార్లదిన్నె మండల పరిధిలో రైతుల పొలాల్లో చోరీకి గురైన కేబుల్ వైర్లను పోలీసులు రికవరీ చేసి, బాధిత రైతులకు అప్పగించారు. మొత్తం 500 మీటర్ల కేబుల్ వైర్లను 21 మంది రైతులకు అందజేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. రికవరీ చేసిన వైర్ల విలువ సుమారు రూ.80 వేలుగా ఉంటుందని పేర్కొన్నారు.

## శ్రీ కాత్యాయిని దేవి అలంకరణలో లేపాక్షి దుర్గాదేవి

– ప్రధాన పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వినయ్ ప్రతాప్



**లేపాక్షి, అక్టోబర్,14, మనంన్యూస్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు లేపాక్షి శ్రీ దుర్గాదేవి అమ్మవారు శ్రీ కాత్యాయిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఎం. వినయ్ ప్రతాప్ ప్రధాన పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు.ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో వినయ్ ప్రతాప్ మరియు తండ్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం. చలపతి, వారి కుటుంబ సభ్యులు, లేపాక్షి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



## ఘనంగా ఉదుగూరు శ్రీ కెంచమాంభ దేవి ఆలయంలో నవరాత్రి మహోత్సవ వేడుకలు



**అమరాపురం, అక్టోబర్ 14,మనంన్యూస్:** అమరాపురం మండలం, ఉదుగూరు గ్రామంలో వెలసిన కుంచిటి వక్కలిగర సోమేనహళ్ళి జానకల్లు గోత్రంనకు చెందిన వారి ఇలవేల్పు శ్రీ కెంచమాంభ దేవి ఆలయంలో నవరాత్రి మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగానే మంగళవారం రాత్రి అమ్మ వారికి వివిధ అభిషేకములు జరిపి, ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం వితరణ చేసినట్లు దేవస్థానం పట్టం పూజరుప్ప సిద్దేశ్వరస్వామి తెలిపారు. నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా 9రోజులు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఇదే నెల 21న శ్రీ కెంచమాంభ దేవుని దేవాలయం నుండి అమ్మవారి ఉత్సవమూర్తిని భక్తి శ్రద్ధలతో మేళా తాళాలతో ఊరేగింపుగా గ్రామ చవరలో ఉన్న బండారు మను, పాదుకట్టపై కూర్చుండ బెట్టి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జంబూసవారీ కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించడంతో నవరాత్రి మహోత్సవ వేడుకలు విజయవంతంగా ముగుస్తాయని దేవస్థానం పట్టం పూజరుప్ప, యజమానులు, కైవాడస్తులు తెలిపారు.



## బాలయ్య అభివృద్ధిపై నమ్మకంతో టీడీపీలోకి 15 కుటుంబాలు

– నాయనిపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



**లేపాక్షి, అక్టోబర్ 14, మనంన్యూస్:** హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తుపై నమ్మకంతో లేపాక్షి మండలం నాయనిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయనిపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. గత పదేళ్లకు పైగా వైఎస్సార్‌సీపీలో కొనసాగినప్పటికీ తమకు, తమ గ్రామానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి, భవిష్యత్తుపై నమ్మకంతో తామంతా మూకుమ్మడిగా తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, బాలాజీ, ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి, నియోజకవర్గ పరిశీలకుడు నాగేశ్వరరావు, టీడీపీ లేపాక్షి మండల కన్వీనర్ అభిలాష్, నాయకులు వీరశేఖర్, మాజీ సర్పంచులు సదాశివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కరరెడ్డి, వెంకటరెడ్డి, మమతారెడ్డి, రామాంజి, ఆనంద్, మహేష్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే పనులను వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

**తాడిపత్రి, అక్టోబర్ 14 మనంన్యూస్** : రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడిపత్రి మండలం ఎర్రగంటపల్లి మరియు బొందలదిన్నె గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించారు. ముందుగా ఎర్రగంటపల్లి గ్రామంలో రీసర్వే కింద గ్రౌండ్ ట్రూథింగ్ పనులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూథింగ్ పనులను వేగంగా చేపట్టాలని, ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, అందులో రీసర్వే పనుల పురోగతి గురించి వివరాలు తెప్పించుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం బొందలదిన్నె గ్రామంలో పెట్రోల్ బంకు ఎన్.ఓ.సికి సంబంధించితనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఎడి కనకప్రసాద్, తాడిపత్రి తహశీల్దార్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్

– సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు పై రైతులకు అవగాహన వారోత్సవాలు – అగలి ఏఓ నాగరాజు

**అగలి, అక్టోబర్ 14,మనంన్యూస్:** మండల కేంద్రమైన అగలిలో బుధవారం గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్ సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు పై అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు అగలి మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ ఉమేష్, సింగల్ విండో అధ్యక్షుడు కుమార్ స్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివరాములు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఉద్యాన రంగ అభివృద్ధి, రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికల రూపకల్పనే లక్ష్యంగా అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.దీనిలో భాగంగానే బుధవారం అగలి రైతు సేవ కేంద్రం పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఉద్యాన రైతులు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, సాగు సౌకర్యాలు, సాంకేతిక సహాయం వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని అయన సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబర్ 2న ప్రారంభించిన 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్' సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రాజెక్టు ద్వారా రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అయన తెలిపారు.ఈ క్రమంలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడం, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం, పంటల ఉత్పాదకతను పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఏఓ తెలిపారు. కమంలో టిడిపి సీనియర్ నాయకులు జయప్ప, శివన్న ఇతర ప్రజాప్రతినిధులు,రైతులు, రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రశాంత నిలయమైన అనంతపురం నగరంలో ప్రజల ఆస్తులకు రక్షణ కరువు

✦ కూటమి ప్రజాప్రతినిధులు.. ప్రజాభక్షకులుగా మారిపోయారు ✦ కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

✦ ఏ నారాయణపురం పంచాయితీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి




**అనంతపురం, అక్టోబర్ 14 మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వంకు సంబంధించిన ప్రజాప్రతినిధుల దురఘాతాలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయని, ప్రజాప్రతినిధులు కాస్త ప్రజా భక్షకులుగా మరిపోతున్నారని అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. బుధవారం అనంతపురం అర్బన్ పరిధిలోని ఏ.నారాయణపురం పంచాయితీకు సంబంధించిన వైయస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ ఆర్‌సీపీ హయాంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంతో ముందుకు వెళ్లామన్నారు. కానీ నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. సంక్షేమ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. రెండున్నరేళ్లగా అనంతపురం నగరంలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపోగా గతం కంటే పింఛన్లను తగ్గించారని తెలిపారు. కూటమి పాలనలో దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ప్రజల బిక్కుబిక్కుమంటూ బతికే పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్ హయాంలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. ఏ.నారాయణపురం పంచాయితీకి కోట్ల రూపాయలు ఖర్చు చేసి రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించి భూముల విలువలను పెంచామన్నారు. రెండున్నరేళ్లలోనే వైఎస్ జగన్, చంద్రబాబు పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించారని తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా కమిటీలు వేశామని, కొత్తగా పదవులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఐడీ కార్డులు అనేవి కార్యకర్తలకు గుర్తింపుతో పాటు భవిష్యత్‌లో గౌరవం తెచ్చిపెడుతాయన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మల్లెల వేణుగోపాల్, రామానుజన్ రెడ్డి, సాకే అశోక్ కుమార్, పుల్లారెడ్డి, రామలింగారెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, లింగారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సురేష, లక్ష్మీనారాయణ, బందారు నరేష్, కుల్లాయప్ప, వెన్నం శివారెడ్డి, జానీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉలవలు పంపిణికి రిజిస్ట్రేషన్ ప్రారంభం

– ఏపీసిఎన్ఎఫ్ పర్వేక్షణలో సూచనలు సలహాలు

– రొళ్ల ఏఓ వెంకటబ్రహ్మం




**రొళ్ల, అక్టోబర్ 14,మనంన్యూస్:** ప్రస్తుతం నెలకున్న తీవ్ర వర్షాభావం కారణంగా ప్రత్యామయ పంటల సాగులో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏపీసిఎన్ఎఫ్ సేంద్రియసిబ్బంది పర్వేక్షణలోవిత్తన శుద్ధి (పెల్లాటైజేషన్) పద్ధతులు ద్వారామండలంలోని రైతులకుఉలవలు పంపిణికి బుధవారం రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించినట్లు రొళ్ల మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటబ్రహ్మం తెలిపారు. ఈసందర్భంగా అయనమాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సిబ్బంది పర్వేక్షణలో విత్తనశుద్ధి(పెల్లటైజేషన్) పద్ధతుల ద్వారా రైతులకు అవగాహనా కల్పిస్తూ ఉలవలు సాగు కు రైతులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉలవనుపొందవచ్చన్నారు. నేడుకూడా రైతులనుండి రిజిస్ట్రేషన్ చేసుకోవడంజరుగుతుందని ఏఓ వెంకటబ్రహ్మతెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఇఓలు,ఆర్ఎస్‌కెఇంచార్జీలు,ఏపీసిఎన్ఎఫ్‌సిబ్బందిరైతులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరు

**మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తిలు**



**మడకశిర, అక్టోబర్ 14,మనంన్యూస్:** మడకశిర పట్టణంలో ఆర్ డబ్ల్యూ ఎస్ మాజీఏఇగవ్వల మల్లికార్జునసోదరుడు ఉపాధ్యాయుడు గవ్వల రామకృష్ణ నూతనంగానిర్మించిన గృహప్రవేశంకార్యక్రమానికి మాజీఎమ్మెల్సీ తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ మూర్తిలు హాజరయ్యారు. వారు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని మహామంగళ హారతి, తీర్థప్రసాదంస్వీకరించారు. ఉపాధ్యాయుడురామకృష్ణ కుటుంబ సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలియజేసారు.తమ ఆహ్వానం మన్నించి నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ, టీడీపి రాష్ట్ర కార్యదర్శి, టీడీపి నాయకులు, ఉపాధ్యాయులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి వీల్‌చైర్స్ వితరణ

**అనంతపురం, అక్టోబర్ 14 మనంన్యూస్ :** ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి 10 వీల్‌చైర్స్ పంపిణీ చేసినట్లు తొండపునాటి అనురాధ ట్రస్టు నిర్వాహకులు మున్నానగర్ రమేష్ తెలిపారు. ఈ వీల్‌చైర్స్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, ఆరఎంవో హేమలత, సామాజిక కార్యకర్త డిస్పజర్ అనిల్ కుమార్‌ల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా మున్నానగర్ రమేష్ మాట్లాడుతూ.. తన తల్లి తొండపునాటి అనురాధ జ్ఞాపకార్థం వీల్‌చైర్స్ పంపిణీ చేశామన్నారు. ఆసుపత్రికి వచ్చే పేదల రోగులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా తమ ట్రస్టు ద్వారా రూ.60 వేలు విలువ చేసే 10 వీల్స్ చైర్స్ అందజేశామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారని, అందులో భాగంగానే తాము ఈ కార్యక్రమం చేశామన్నారు. గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మున్ముందు కూడా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుమూర్తి, రవి, రత్నమయ్య, నరసింహులు, కుమార్, వినోద్, సుదర్శన్, వలి, మణికంఠ, మధు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



## మడకశిర ఆర్టీసీ నూతన డిఎంగా జనార్దన్

ఘనంగా సన్మానించిన డిపో ఎన్ఎంయుపి నాయకులు సిబ్బంది



**మడకశిర, అక్టోబర్ 14,మనంన్యూస్:** ఏపీఎస్ఆర్టీసీ మడకశిర డిపో డిఎంగా జనార్దన్ బుధవారం తనపదవి బాధ్యతలనుస్వీకరించారు. ఈ సందర్భంగా కొత్త డిఎంకు మడకశిర ఆర్టీసీడిపో ఎన్ఎంయుపినాయకులు శాలువా కప్పి,పూలమాల వేసి ఘనంగాసన్మానించారు.ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయుపి డిపో సెక్రటరీ కరియప్ప, ఆఫీస్ సిబ్బంది మహేష్, టి.లక్ష్మీ కాంతం, ఆర్ టి రామన్న, కమిటీ చైర్మన్ ముద్దప్ప, జయసింహా,పురుషోత్తం,గ్యారేజ్‌సెక్రటరీ బాబు,అజీజ్ ట్రెజరర్ బిఎస్‌నాయక్, సిస్టం గంగాధర్, చన్నరాయప్ప, డ్రైవర్ సురేష్, ఎలక్ట్రీషియన్ బాబ్జాన్, మల్లికార్జున గ్యారేజ్ సిబ్బంది జియావుల్లా, నరేష్, హరి ప్రసాద్, పాల్గొన్నారు.

## గొడిసలపల్లిలో భగలాముఖి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

ఐదు మండలాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

మార్కెట్ యార్డు చైర్మన్ ఉండాల హనుమంతరెడ్డి పిలుపు



**డి.హీరేహాళ్, అక్టోబర్ 14 మనంన్యూస్:** మండల పరిధిలోని గొడిసలపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీ భగలాముఖి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాయదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్ ఉండాల హనుమంతరెడ్డి తెలిపారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు, ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. భక్తుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు.

## మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

వైసీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల నదీమ్



**అనంతపురం, అక్టోబర్ 14 మనం న్యూస్ :** మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి వేముల అబుజర్ నదీమ్ అన్నారు. బుధవారంనిర్వహించిన విలేకరుల సమావేశంలో అబుజర్ నదీమ్ మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆశీస్సులతో తనకు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.నగరంలో ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ నగరం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. మేయర్‌గా అవకాశం కల్పిస్తేఅనంతపురం నగరఅభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రజా 'సేవే' నాయక్ కర్తవ్యం

– ఎంపిపి బరిలో మాజీ జెడ్పిటీసీ



**ముదిగుబ్బ అక్టోబర్ 14 మనంన్యూస్ :** ప్రజాసేవే నా ప్రథమ కర్తవ్యమని మాజీ జెడ్పిటీసీ సభ్యుడు సేవేనాయక్ స్పష్టం చేసారు. బుధవారం ఆయన 'మనం'తో మాట్లాడారు. ఈ సారి జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిగుబ్బ మండలానికి ఎస్టీ రిజర్వేషన్ కావడంతో అధిష్ఠానం ఆదేశిస్తే ఎంపిపి స్థానానికి బరిలో దిగేందుకు సిద్ధంగా వున్నానన్నారు. రాష్ట్ర వైద్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నేత చిలకం మధుసూదన్ రెడ్డిలు తనపై నమ్మకం ఉంచి ఎంపిపి స్థానానికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. లోకల్ బాడీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ ఆదేశానుసారం పనిచేస్తానన్నారు. ప్రజలకు అన్నివిధాలా అందుబాటులో వుంటూ ముదిగుబ్బ మండలాన్ని అభివృద్ధి పథంలో తెస్తానన్నారు. గతంలో జెడ్పిటీసీ సభ్యుడిగా పని చేసిన అనుభవం తనకుందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తానన్నారు. మండల ప్రజల ఆశీస్సులతో మరో సారి ఈ గిరిజన బిడ్డకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. అలాగే వెనుకబడిన గిరిజనుల అభివృద్ధికి పాటు పడతానన్నారు.



# కలం నుంచి వెండితెరకు.. రాజు నటప్రస్థానం

-సత్యసాయి అవతార వైభవంలో పుట్టపర్తి పాత్రికేయుడికి అరుదైన అవకాశం
-బాబా చిన్నాన్నగా సీనియర్ పాత్రికేయుడు యూఎస్ రాజు
-హీరో సుమన్‌కు తమ్ముడిగా నటన.. ఓం సాయి ప్రకాష్ దర్శకత్వంలో 109వ చిత్రం
-రత్నాకర్ ఆశీస్సులతో ఆధ్యాత్మిక నేపథ్య చిత్రంలో కీలక పాత్ర

**పుట్టపర్తి, అక్టోబర్ 14: మనం న్యూస్:** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జీవితం అంటే కోట్లాది మంది భక్తులకు విశ్వాసం.. మానవత్వానికి మార్గదర్శనం.. సేవకు స్ఫూర్తి.. ప్రేమకు ప్రతిరూపం. కులమతాలకు అతీతంగా మానవసేవే మాధవసేవ అని చాటిచెప్పిన సత్యసాయి ఆధ్యాత్మిక ప్రస్థానం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఈ మహత్తర దృశ్యకావ్యంలో పుట్టపర్తికి చెందిన సీనియర్ పాత్రికేయుడు యూఎస్ రాజుకు నటించే అవకాశం లభించడం విశేషంగా నిలిచింది. అక్షరాలతో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చిన ఆయన, ఇప్పుడు వెండితెరపై ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రముఖ దర్శకుడు ఓం సాయి ప్రకాష్ దర్శకత్వంలో, శ్రీ బాలామణి ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'శ్రీ సత్యసాయి అవతార వైభవం' చిత్రంలో యూఎస్ రాజు.. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా చిన్నాన్న పాత్రను పోషిస్తున్నారు. బాబా కుటుంబ నేపథ్యాన్ని ప్రతిబింబించే ఈ పాత్రలో నటించడం తనకు లభించిన గొప్ప అదృష్టంగా ఆయన భావిస్తున్నారు. ప్రముఖ నటుడు సుమన్ బాబా తండ్రి పాత్రలో, నటి ఆమని తల్లి పాత్రలో, సీనియర్ నటుడు మురళీమోహన్ తాతగారైన కొండమరాజు పాత్రలో నటిస్తుండగా, అటువంటి ప్రముఖుల సరసన పుట్టపర్తి వాసి యూఎస్ రాజుకు చోటు దక్కడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఒకవైపు పాత్రికేయుడిగా ప్రజా జీవితానికి దగ్గరగా ఉంటూ, మరోవైపు తనకు ఎంతో ఇష్టమైన నటనారంగంలో అడుగుపెట్టిన యూఎస్ రాజుకు ఈ అవకాశం ప్రత్యేకమైనది. చిన్నప్పటి నుంచి హీరో సుమన్‌కు వీరాభిమానిగా ఉన్న ఆయన, ప్రస్తుతం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల సుమన్ అభిమాన సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన అభిమాన నటుడికి తమ్ముడిగా తెరపై కనిపించే అవకాశం రావడంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అభిమానిగా మొదలైన అనుబంధం, ఇప్పుడు ఒకే చిత్రంలో కలిసి నటించే స్థాయికి చేరడం ఆయనకు మధురానుభూతిని మిగిల్చింది.భక్తి చిత్రాల రూపకల్పనలో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు ఓం సాయి ప్రకాష్‌కు ఇది 109వ చిత్రం కావడం మరో విశేషం. అన్నమయ్య, శ్రీరామదాసు, నమో వెంకటేశాయ, జగద్గురు ఆదిశంకరాచార్య వంటి భక్తి చిత్రాలకు రచనా సహకారం అందించిన ప్రముఖ రచయిత జేకే భారవి ఈ చిత్రానికి రచయితగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నటీనటులు, అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల కలయికతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం సత్యసాయి భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తోంది.ఇటీవల హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఎనిమిది రోజులపాటు జరిగిన చిత్రీకరణలో యూఎస్ రాజు తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేశారు. షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ, తాను ఆరాధించే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జీవితానికి సంబంధించిన చిత్రంలో ఆయన కుటుంబ సభ్యుడి పాత్ర పోషించడం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. తన అభిమాన దర్శకుడు ఓం సాయి ప్రకాష్ దర్శకత్వంలో పనిచేయడం, అభిమాన హీరో సుమన్‌తో కలిసి నటించడం భగవాన్ అనుగ్రహంగా భావిస్తున్నానని ఉద్వేగంగా పేర్కొన్నారు.శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఆశీస్సులు తనకు ఈ అవకాశాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని యూఎస్ రాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన దర్శకుడు ఓం సాయి ప్రకాష్‌కు, సహదర్శకుడు భిక్షపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్రీకరణలో సహకరించిన తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు."బాబా వారి చిత్రంలో నటించడం కేవలం ఒక పాత్రకు పరిమితం కాదు.. అది నా జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆధ్యాత్మిక అనుభూతి" అన్న భావనతో యూఎస్ రాజు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిత్రీకరణ జరిగిన ప్రదేశంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం ప్రతి ఒక్కరిలోనూ భక్తిభావాన్ని నింపిందని, ప్రతి సన్నివేశం బాబా వారి సాన్నిధ్యంలో జరుగుతున్న అనుభూతిని కలిగించిందని తెలిపారు.కలం పట్టి ప్రజల గొంతుకగా నిలిచిన పాత్రికేయుడు.. ఇప్పుడు కెమెరా ముందు పాత్రధారిగా మారారు. అభిమానాన్ని అనుభవంగా, భక్తిని నటనగా మలుచుకుంటూ యూఎస్ రాజు సాగిస్తున్న ఈ కొత్త ప్రయాణం పుట్టపర్తి వాసులకు గర్వకారణంగా నిలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రల్లో నటించే అవకాశం వస్తుందన్న ఆశాభావంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

# తిరుమాడ విస్తరణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నష్టపరిహారం అందిస్తాం
- పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, అక్టోబర్ 14మనంన్యూస్ :-కదిరి పట్టణంలోని తిరుమాడ వీధి రోడ్డు విస్తరణ పనులకు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ నిర్వహించి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి నియోజకవర్గ పరిశీలకులు చెంచయ్య నాయుడు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ"కదిరి పట్టణ అభివృద్ధిలో రోడ్డు విస్తరణ కీలకమైన భాగం. ఈ పనులపై ఎవరూ అపోహలకు గురికావద్దు. ఎవరు ఎలాంటి ఆటంకాలు సృష్టించినా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి సహకారంతో, ఎవరికీ అన్యాయం జరగకుండా రోడ్డు విస్తరణ పనులు చేపడతాం. ఎవరినీ బలవంతం చేయం.. ఎవరికీ అన్యాయం జరగనివ్వం! నిబంధనల ప్రకారం నోటీసులు అందించి, ప్రభుత్వ విధివిధానాల మేరకు అర్హులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే సంబంధిత ప్రక్రియను కొనసాగిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అందరినీ సంప్రదిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తాం. కదిరి పట్టణానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి మరింత పాధాన్యత ఇస్తాం. దేవస్థానం ఆదాయాన్ని భవిష్యత్తులో రూ.100 కోట్ల స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు చేపడతాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, ఆతిథ్యం కల్పించి, వారు సంతోషంగా స్వామివారిని దర్శించుకునేలా కదిరిని అభివృద్ధి చేస్తాం.రానున్న రోజుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతాం. కదిరి అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రజల సహకారంతో కదిరిని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దాం" అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, ముస్లిం మత పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్,పట్టణ టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొత్తం 15 స్థానాలలు. -మహిళలకు 7 , జనరల్ కు 8 కేటాయింపు

-జెడ్పిటిసి మహిళ జనరల్, -ఎంపిపి, బిసి జనరల్.



**కుందుర్పి, అక్టోబర్ 14 మనంన్యూస్:** కుందుర్పి మండల పరిధిలోని ఎంపీటీసీలు (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ) స్థానాల రిజర్వేషన్లను కళ్యాణ దుర్గం ఆర్డిఓ, ఎంపిడిఓ అధికారులు అధికారికంగా బుధవారం ఖరారు చేశారని ఆ జాబితాలో పేర్కొన్నారు. .కుందుర్పి మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 07 మహిళలకు, 08 జనరల్ కు కేటాయించారు. ఎస్టీ వర్గానికి ఒక్క స్థానం కూడా కేటాయించలేదు.

**వర్గాల వారీగా వివరాలు:** ఎస్సీ 03 స్థానాలు (జనరల్-2, మహిళ-1), బీసీ : 4 స్థానాలు (జనరల్-2, మహిళ-2), అన్‌రిజర్వ్ : 8 స్థానాలు (జనరల్-4, మహిళ-4), ఎస్టీ : 0లుకలవుని పేర్కొన్నారు.

**ఎంపిటిసిల స్థానాల వారీగా రిజర్వేషన్ జాబితా:**

గ్రామం రిజర్వేషన్ ఆపిలేపల్లి బీసీ ,మహిళ, బసాపురం ,ఎస్సీ బెస్తరపల్లి జనరల్,, ఎనుములదొడ్డి-1 జనరల్, ఎనుములదొడ్డి-2 ఎస్సీ,ఈ జాబితాకు కుందుర్పి ఎంపీడీవో, కళ్యాణదుర్గం ఆర్డీవో అధికారులు ఆమోదముద్ర వేశారు.ఈ జాబితాను మిడియాకు ఎంపిటిసిల రిజర్వేషన్ వివరాలును వెల్లడించారు.

# ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి సేవలో కర్ణాటక రాష్ట్ర మంత్రి కేహెచ్ మునియప్ప





**కదిరి అర్బన్ అక్టోబర్ 14 మనం న్యూస్:** పట్టణంలో వెలసిన శ్రీమత్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారంక ర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప దంపతులు సందర్శించారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ ప్రధానార్చకులు తూర్పు రాజగోపరమందు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు ఆలయంలో ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ అధికారులు మంత్రి దంపతులకు స్వామివారి శేష వస్త్రాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తున్న ఓటర్ల

**నంబుల పూల కుంట అక్టోబర్ 14 మనం న్యూస్:** ఆత్మీయ పలకరింపులకే పరిమితం కాకుండా.. అభివృద్ధి చేసే నాయకుడే కావాలినంబులపూలకుంట: స్థానిక ఎన్నికలు సమీపిస్తుండటంతో మండలంలో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల వేళ నాయకులు ఓటర్లను ఆత్మీయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అయితే, ఈసారి ఓటర్లు మాత్రం వ్యక్తిగత పలకరింపుల కంటే మండల అభివృద్ధికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది.మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం వంటి సమస్యలను పరిష్కరించే అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాటలకంటే చేతలు.. వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా సంక్షేమం అనే ఆలోచనతో ఓటర్లు తమ నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.ఈసారి ఓటర్ల ఆలోచన మారుతోందా? అభివృద్ధి చేసే నాయకుడికే పట్టం కడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# వేద మంత్రఘోషతో మార్మోగిన ప్రశాంతి నిలయం



-లోకక్షేమం.. విశ్వశాంతి సంకల్పంతో వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞానికి శ్రీకారం
-అగ్ని ప్రతిష్ఠ.. రుద్ర హోమం.. సహస్ర లింగార్చనతో ఆధ్యాత్మిక వైభవం
-భగవాన్ సత్యసాయి దివ్య సంకల్పానికి ప్రతిరూపంగా పవిత్ర యజ్ఞం ప్రారంభం

**పుట్టపర్తి అక్టోబర్ 14 మనం న్యూస్ :** వేద మంత్రాల పవిత్ర నాదం.. యజ్ఞాగ్నికి సమర్పించిన ఆహుతులు.. భక్తుల ప్రార్థనలు.. ఆధ్యాత్మిక చింతనతో నిండిన ప్రశాంత వాతావరణం.. ఇలా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం భక్తిభావంతో పరవశించింది. విశ్వశాంతి, లోకకల్యాణం, సమస్త జీవరాశుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ పవిత్ర వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. దేవీ నవరాత్రి, దసరా వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పవిత్ర యజ్ఞం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య అనుగ్రహాన్ని స్మరించుకుంటూ సంప్రదాయబద్ధంగా కొనసాగింది. ఉదయం భజన మందిరంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పవిత్ర కలశానికి కుంకుమార్చన నిర్వహించిన అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ కలశాన్ని పూర్ణచంద్ర ఆడిటోరియానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. పవిత్ర కాష్ఠాలను మథించి అగ్నిని ఆవాహన చేసి యజ్ఞకుండంలో ప్రతిష్ఠించారు. వేద పండితులు రుద్ర హోమాన్ని నిర్వహిస్తూ యజ్ఞాగ్నికి ఆహుతులు సమర్పించారు. లోకాలన్నీ శాంతి, సౌభ్రాతృత్వం, సామరస్యంతో విలసిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



యజ్ఞ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సహస్ర లింగార్చన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వెయ్యి పవిత్ర మృత్తికా లింగాలకు పూజలు నిర్వహిస్తూ పరమశివుని సర్వవ్యాపక తత్వాన్ని స్మరించారు. సకల జీవరాశులకు వెలుగును, జీవనాధారాన్ని అందించే సూర్య భగవానునికి కృతజ్ఞతగా సూర్య నమస్కారాలు ఆచరించారు. రామాయణం, శ్రీమద్భాగవతం, దేవీ మహాత్మ్యం పారాయణాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భగవాన్ విద్యార్థులు దేవీ మహాత్మ్యంలోని పవిత్ర





శ్లోకాలను భక్తిశ్రద్ధలతో పారాయణం చేయడంతో ఆడిటోరియం వేద మంత్రఘోషతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, శ్రీ సత్యసాయి సేవా సంస్థల సీనియర్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. యజ్ఞ ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రార్థనలు చేశారు. వేద పారాయణాలు, హోమాలు, పూజా కార్యక్రమాలతో ప్రశాంతి నిలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 1962లో స్వయంగా ప్రారంభించిన వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం వేద విజ్ఞాన పరిరక్షణకు, సనాతన ధర్మ విలువల ప్రచారానికి ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలకు వేద సంప్రదాయాన్ని అందించడంతో పాటు మానవాళిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాలన్న భగవాన్ సంకల్పాన్ని ఈ యజ్ఞం చాటిచెబుతోంది. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే మానవీయ విలువలను ఆచరణలో పెట్టాలనే సందేశాన్ని అందిస్తోంది.వారం రోజులపాటు కొనసాగనున్న ఈ పవిత్ర యజ్ఞంలో భాగంగా నిర్వహించే పూజలు, హోమాలు, వేద పారాయణాలు సర్వలోక క్షేమం కోసం అంకితం కానున్నాయి. వ్యక్తిగత శాంతి నుంచి విశ్వశాంతి వరకు మానవాళి శ్రేయస్సును ఆకాంక్షించే ఈ ఆధ్యాత్మిక మహోత్సవం ప్రశాంతి నిలయం పవిత్రతను, భగవాన్ సత్యసాయి బోధనల సార్వజనీనతను మరోసారి చాటిచెబుతోంది.

# పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ సెంటర్ ప్రారంభం

-'వివేకానంద యూత్ స్టడీ సర్కిల్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ తరగతులు
-విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**హిందూపురం (మనం న్యూస్) అక్టోబర్ 14:**
పట్టణంలోని ఎంజీఎం మున్సిపల్ హైస్కూల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'వివేకానంద యూత్ స్టడీ సర్కిల్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ తరగతులు, స్టడీ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతినిధి వీరయ్య హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు పోటీ పరీక్షలకు మెరుగ్గా సిద్ధమయ్యేందుకు ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించి, స్టడీ సెంటర్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని వీరయ్య సూచించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ తాను కూడా గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థినేనని, ఐటీఐలో డీజిల్ మెకానిక్ కోర్సు చదివి ప్రస్తుతం గ్రూప్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం మంచి అవకాశమన్నారు. స్టడీ సెంటర్‌కు వచ్చే అభ్యర్థులకు గ్రూప్ ఆఫీసర్ల ద్వారా అవసరమైన మార్గదర్శనం



అందిస్తామని చెప్పారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనలతో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆర్థిక సహకారంతో గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హిందూపురం నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టడీ సెంటర్ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే బాలకృష్ణకు జిల్లా కలెక్టర్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతినిధి వీరయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్టడీ సెంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు సెంటర్ ఇన్‌చార్జి మారుతి ప్రసాద్‌ను 94411 05700 నంబర్‌లో సంప్రదించి దరఖాస్తు పొందవచ్చు.



# పలు శుభ కార్యక్రమాలలో బిజీ బిజీగా ఎంపీ పార్థసారథి



**పరిగి (మనం న్యూస్) అక్టోబర్ 14 :** స్థానిక నియోజకవర్గం రొద్దం మండలం సానిపల్లి గ్రామానికి చెందిన చోలేమర్రి నరసింహప్ప కుమార్తె (హనుమంతు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ చెల్లెలు) వివాహానికి పైడేటి సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో బుధవారం హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారథి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పైడేటి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవస్థానం పనులను పరిశీలించారు.అనంతరం దేవస్థానంలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఇక రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాగభూషణ కుమారుడి వివాహానికి అనంతపురం పట్టణంలోని డి ఆర్ కన్వెన్షన్ హాల్ నందు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నంజుండప్ప తోపాటు నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ధరణి కిషోర్ బాధ్యతల స్వీకరణ

**గుత్తి, అక్టోబర్ 14, (మనం న్యూస్ ):** గుత్తి నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ధరణి కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో విధులకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించారు.



గుత్తి ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై ఆయన దృష్టి సారించనున్నారు.

# ఎన్నికల బరిలో ఆశావహులు

- టీడీపీ టికెట్ ఆశిస్తున్న రామ్మూర్తి నాయుడు

**కుందుర్పి, అక్టోబర్ 14,మనం న్యూస్:** కుందుర్పి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎంపీటీసీ రిజర్వేషన్లు బుధవారం ఖరారైన నేపథ్యంలో పలు పార్టీల్లో ఆశావహులు టికెట్ల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కుందుర్పి మండల సాగు నీటి సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు టీడీపీ పార్టీ తరపున ఎంపీపీ పదిని ఆశిస్తున్నారు. తద్వారా కుందుర్పి ఒకటి ,రెండు ఎంపీటీసీ స్థానాలు మహిళల కేటాయించారు. ఈ క్రమంలోని ఈ పోటీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు.గత కొన్నేళ్లుగా సాగునీటి



సంఘం అధ్యక్షుడిగా రైతుల సమస్యలపై పోరాడుతూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయనకు టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని ఆయన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ "పార్టీ ఆదేశిస్తే ఎంపీటీసీగా పోటీ చేసి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను. రైతులు, యువతకు అండగా ఉంటాను" అని తెలిపారు. ఆయనకు మండల వ్యాప్తంగా రైతులు, యువత నుండి మద్దతు లభిస్తోంది. జడ్పిటిసి ఎంపీపీ రిజర్వేషన్ లు అధికారంగా ఖరారు చేసారు. దింతో ఎన్నికల రంగం సిద్ధమైంది. ఆయ స్థానాలలో పోటీ చేయాలని అభ్యర్థులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రధానంగా బెస్తరపల్లి గ్రామం,కెంచంపల్లి నుంచి మహిళలు జెడ్పిటిసి, యంపిపి స్నానానికి తమకు కావాల్సిందని గట్టి ప్రయత్నం చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో టికెట్ల కోసం ఆశావహులు పావులు జోరగా కదుపుతున్నారు.

# ఎన్నికల వేళ పకడ్బందీ భద్రత: ఎస్పీ జగదీశ్

**దుర్గంలో అధికారులతో సమీక్ష.. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ**




**కళ్యాణదుర్గం అక్టోబర్ 14 మనం న్యూస్ +** ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీశ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అధికారులతో ఆయన ఎన్నికల బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. రూట్ మొబైల్ పోలీసుల ద్వారా నిరంతరం గస్తీ కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లు, గతంలో అల్లర్లకు పాల్పడిన వారిపై నిఘా ఉంచడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన**

సమీక్ష అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కేంద్రాల వద్ద బారికేడ్ల ఏర్పాటు, సీసీ కెమెరాల నిఘా, రాకపోకల మార్గాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ టి. దైవప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మంజుల, పట్టణ సీఐ హరినాథ్, గ్రామీణ సీఐ గంగాధర్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలు చేతిలో బ్రహ్మాస్త్రంలా దోహదం ఆర్టిఐ

**- అవినీతిని ఈ చట్టంతోనే చెక్కు. - ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ**
**-ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని పిలుపు.**
**- పారదర్శకత జవాబుదారీ తనం పెంపుకు దోహదం.**
**- కుందుర్పిలో ఘనంగా ఆర్టీఐ 21వ, ఆవిర్భావ దినోత్సవం వేడుకలు.**




**కుందుర్పి, అక్టోబర్ 14 మనంన్యూస్:** సమాజంలో ఆర్,టిఐ చట్టాన్ని సక్రమంగా కార్యచరణలో వినియెగించు కొంటే సామాన్య ప్రజలు చేతిలో బ్రహ్మాస్త్రంలా ఆర్.టి.ఐ చట్టం దోహద పడుతుందని ఆర్టిఐ నాయకులు సూచించారు. బుధవారం మండల కేంద్రంమైన కుందుర్పిలో ఆర్టీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2025 ,21వ, ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ కమిటి నాయకులు, కార్యకర్తలు మధ్యన అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్టీఐ సమావేశం ఈ శ్రీనివాసులు అధ్యక్షతన కొనసాగింది. ఈసందర్భంగా ఆర్టీఐ గౌరవాధ్యక్షురాలు, బి.కె. గోపాల్, మండల అధ్యక్షుడు ,ఎంజి, శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో కొంత మంది సక్రమంగా అధికారులు పనిచేయడం లేదన్నారు. మరికొంత మంది ప్రజలు పనిచేయలంటే రెవెన్యూ అధికారులు అవినీతి పాల్పడుతున్నారని బికె గోపాల్ ఆరోపించారు. రైతులు పనిచేయడానికి పౌరులు చేయి తడపక పోతే పని చేయకుండా చెక్కుపెట్టేలా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. స.హ.చట్టం ప్రాముఖ్యతను నిశితంగా వివరించి చైతన్య పరిచారు. 2005 అక్టోబర్ 12న దేశవ్యాప్తంగా అమలుకు వచ్చిన ఈ చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదిన్నారు. ప్రతి పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం పొందే హక్కు కలిగి ఉన్నాడని వివ రించారు.ప్రజలు ఈ చట్టం పట్ల అవగాహనతో చైతన్య వంతులై స.హ.చ. వినియెగించు కొవాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుండి సచివాలయం వరకు జరిగే ప్రతి పనిలో పారదర్శకత, జవాబు దారీతనం పెరగడానికి ఆర్టీఐ ఎంతో దోహద పడుతుంది. 30 రోజుల్లో సమాధానం: దరఖాస్తు దారులు మిరు పెట్టిన దరఖాస్తుకు 30 రోజుల్లోపు సంబంధిత అధికారి వారు సమాచారం ఇవ్వాల్సిందే అని చెప్పారు. అలా సమాచారం మిరు కోరినది ఇవ్వని పక్షంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది సూచించారు. రేషన్, పింఛన్, ఉపాధి హామీ, భూ రికార్డులు వంటి సమస్యలపై ప్రతి ఒక్కరూ ఆర్టీఐ ద్వారా సమాచారాన్ని కోరి అధికారులుచే పొందేలా న్యాయం పొందవచ్చుని తెలిపారు. ఈనేపథ్యంలో అధికారులు ప్రజలకు సేవకులే తప్ప పాలకులు కాదని గుర్తుచేసే చట్టం ఆర్టీఐ. అని గుర్తు చేశారు ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరు దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకున్నప్పుడే చట్టానికి విలువ,లక్ష్యం చేదించడం సాధ్యమన్నారు. ఈసమావేశానికి డిప్యూటీ తాసిల్దార్ , తిప్పేస్వామి,విఆర్ఓ,అజిత్ కుమార్,లు హాజరయ్యారు.డిటి అధికారి మాట్లాడుతూ. ప్రభుత్వ కార్యాలయాలులో గోప్యతకు తావులేకుండా బహిర్గతం చేయడం ఆర్ టిఐ మఖ్యలక్ష్యం అన్నారు. ప్రజలు సెక్షన్ 6(1 )ఏ ప్రకారం వ్యక్తిగత సమాచారం కాకుండా, సమాజానికి ఉపయోగపడే కార్యాలయం రికార్డులు, సమాచారం కోరవచ్చన్నారు.ఈ సమాచారాన్ని నెలరోజుల్లోగా ఇవ్వాలని. అలా ఇవ్వననిచో మొదటి అప్పిల్ ఆర్డీవోకి, అక్కడ సమాచారం రానిచో, కమిషనర్కు రెండోసారి ఆప్పిల్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న స.హ. దరఖాస్తులయితే 24 గంటల వ్యవధిలో సమాచారం వారికి అందించాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మండల కార్యదర్శి,జాకీ, ,కె, ఈరన్న, ఉపాధ్యక్షులు, రామదాసు, జనరల్ సెక్రెటరీ, కోశాధికారి,జి, గోవిందరాజులు, అర్టిఐ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు. కవిత, సుమలత, డి, క్రిష్ణ మూర్తి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో రిజర్వేషన్ల మార్పులు

**-జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో మారిన సామాజిక సమీకరణాలు**
**-32 మండలాల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లపై ఆసక్తి.. మహిళలకు పలు స్థానాలు**
**- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయింపులు**
**-2021తో పోలిస్తే జెడ్పీటీసీ స్థానాల్లో పలు మార్పులు**




**పుట్టపర్తి అక్టోబర్ 14మనం న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లాలో ఎన్నికలు--2026 నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జిల్లాలోని 32 మండలాలకు సంబంధించి జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లలో 2021తో పోలిస్తే పలు మార్పులు చోటుచేసుకోగా, ఎంపీపీ రిజర్వేషన్లలోనూ వివిధ సామాజిక వర్గాలకు కేటాయింపులు జరిగాయి. జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు మహిళలకు పలు స్థానాలు కేటాయించడంతో స్థానికంగా ఎన్నికలపై ఆసక్తి పెరుగుతోంది.

**-జెడ్పీటీసీ స్థానాల్లో మారిన రిజర్వేషన్లు**

2021 రిజర్వేషన్లతో పోలిస్తే 2026 జెడ్పీటీసీ కేటాయింపుల్లో పలు మండలాల్లో సామాజిక వర్గాలు మారాయి. అగళి స్థానం జనరల్ నుంచి ఎస్సీ మహిళకు, అమరాపురం ఎస్సీ మహిళ నుంచి బీసీకి, బుక్కపట్నం జనరల్ మహిళ నుంచి బీసీకి మారాయి. గోరంట్లలో ఎస్టీ జనరల్ నుంచి బీసీ మహిళకు, గుడిబండలో ఎస్సీ జనరల్ నుంచి బీసీ మహిళకు కేటాయింపు జరిగింది. చిలమత్తూరు బీసీ మహిళ నుంచి జనరల్‌కు, కనగానపల్లి జనరల్ నుంచి ఎస్సీకి, లేపాక్షి జనరల్ నుంచి బీసీ మహిళకు మారాయి. మడకశిరలో ఎస్సీ మహిళ నుంచి బీసీకి, నల్లమాడలో జనరల్ నుంచి ఎస్టీ మహిళకు, రామగిరిలో జనరల్ నుంచి ఎస్సీ మహిళకు, రొద్దంలో బీసీ మహిళ నుంచి ఎస్సీకి, రొళ్లలో జనరల్ నుంచి ఎస్సీ మహిళకు మార్పులు నమోదయ్యాయి.
బత్తలపల్లి, సి.కె.పల్లి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి వంటి మండలాల్లోనూ రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. అమడగూరు, ఎన్.పి.కుంట స్థానాల్లో మహిళల రిజర్వేషన్లు కొనసాగగా, మరికొన్ని స్థానాల్లో జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల మధ్య మార్పులు జరిగాయి.

**ఎంపీపీ రిజర్వేషన్లలోనూ వర్గాల వారీగా కేటాయింపులు**

జిల్లాలోని 32 మండలాలకు సంబంధించి ఎంపీపీ రిజర్వేషన్లలోనూ వివిధ సామాజిక వర్గాలకు అవకాశం కల్పించారు. ఆగళిలో ఎస్సీ, అమరాపురం, గుడిబండ, మడకశిరల్లో ఎస్సీ మహిళలకు కేటాయింపులు ఉన్నాయి. కదిరిలో ఎస్టీ మహిళకు, ముదిగుబ్బలో ఎస్టీ వర్గానికి రిజర్వేషన్ కల్పించారు. బుక్కపట్నం, చిలమత్తూరు, నంబులపులకుంట, పెనుకొండ మండలాల్లో బీసీ మహిళలకు కేటాయింపులు ఉండగా, గోరంట్ల, హిందూపురం, రొద్దం, రొళ్ల, సోమందేపల్లి మండలాలకు బీసీ రిజర్వేషన్లు ఉన్నాయి. అదేవిధంగా గాండ్లపెంట, కొత్తచెరువు, నల్లచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, తాడిమర్రి, తలుపుల, తనకల్లు మండలాల్లో జనరల్ మహిళలకు కేటాయింపులు ఉన్నాయి. అమడగూరు, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, కనగానపల్లి, లేపాక్షి, ఓబులదేవరచెరువు, రామగిరి తదితర మండలాల్లో జనరల్ కేటగిరీకి రిజర్వేషన్లు కేటాయించారు. పరిగి మండలానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించారు.

**మహిళలకు అవకాశాలు.. ఆశావహుల్లో ఆసక్తి**

జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లలో మహిళలకు కేటాయింపులు ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. ఏ మండలం ఏ సామాజిక వర్గానికి కేటాయించబడిందన్న అంశం అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారనుంది. రాజకీయ పార్టీలు కూడా ఆయా మండలాల్లో రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు వేర్వేరు కేటాయింపులు కావడంతో వాటిని విడివిడిగా పరిగణించాల్సి ఉంటుంది. తుది అధికారిక ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు నిర్ధారించుకున్న అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# గోరంట్ల జెడ్పీటీసీ బరిలో ఎవరు? సమన్వయమా.. సమరమా?

**-బీసీ మహిళకు రిజర్వేషన్.. కూటమి అభ్యర్థిపై ఉత్కంఠ**
**-వైసీపీ వ్యూహం ఏమిటి? ఆసక్తి రేపుతున్న అభ్యర్థుల ఎంపిక**




**గోరంట్ల, అక్టోబర్ 14 మనం న్యూస్ :** గోరంట్ల జెడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు కేటాయించడంతో స్థానిక రాజకీయాలు ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. రిజర్వేషన్ ఖరారు కావడంతో ఇప్పుడు అందరి దృష్టి అభ్యర్థుల ఎంపికపై పడింది. కూటమి పార్టీల నుంచి ఎవరు బరిలో నిలవబోతున్నారు? నాయకుల మధ్య సమన్వయం కుదిరి ఒకే అభ్యర్థికి అవకాశం కల్పిస్తారా? లేక ఆశావహుల పోటీతో రాజకీయ సమీకరణాలు వేడెక్కుతాయా? అన్న ప్రశ్నలు గోరంట్ల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రిజర్వేషన్ బీసీ మహిళకు కేటాయించడంతో ఆయా పార్టీల్లో అర్హులైన మహిళా అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక నాయకుల అభిప్రాయాలు, క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉన్న సంబంధాలు, పార్టీ కోసం పనిచేసిన వారికి లభించే ప్రాధాన్యం అభ్యర్థి ఎంపికలో ప్రభావం చూపే అవకాశముంది. నేతలంతా ఏకాభిప్రాయంతో ముందుకు సాగితే ఒకే అభ్యర్థి చుట్టూ రాజకీయ బలం సమీకృతమవుతుంది. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే మాత్రం ఆశావహుల మధ్య పోటీ అనివార్యమయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో కూటమి నాయకత్వం అనుసరించే వ్యూహంపై ఆసక్తి నెలకొంది. మరోవైపు వైసీపీ తరఫున జెడ్పీటీసీ బరిలో నిలిచే మహిళా అభ్యర్థి ఎవరన్నది కూడా చర్చకు దారితీస్తోంది. స్థానికంగా ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగిన నాయకురాలికి అవకాశం ఇస్తారా? పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్న మహిళా నేతను ఎంపిక చేస్తారా? లేక కొత్త ముఖాన్ని రాజకీయ రంగంలోకి తీసుకొస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల అభిప్రాయాలు, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం అభ్యర్థి ఎంపికలో కీలకంగా నిలవనున్నాయి. రిజర్వేషన్ ఖరారైన నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసే అవకాశం ఉండగా, ప్రధాన రాజకీయ పార్టీలు కూడా అనుకూలమైన అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పటివరకు అభ్యర్థుల పేర్లపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో గోరంట్ల జెడ్పీటీసీ స్థానం చుట్టూ రాజకీయ ఆసక్తి మరింత పెరుగుతోంది. కూటమి నేతలు సమన్వయ మంత్రంతో ముందుకు సాగుతారా? లేక పోటీకి తెరతీస్తారా? వైసీపీ ఎవరికి అవకాశం కల్పించనుంది? అన్న ప్రశ్నలకు అభ్యర్థుల ప్రకటనతోనే స్పష్టత రానుంది. అప్పటివరకు గోరంట్ల జెడ్పీటీసీ రాజకీయం స్థానికంగా చర్చనీయాంశంగానే కొనసాగనుంది.

# శ్రీ కాత్యాయిని దేవి అలంకరణలో లేపాక్షి దుర్గాదేవి

**-ప్రధాన పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వినయ్ ప్రతాప్**



**లేపాక్షి, అక్టోబర్,14, మనం న్యూస్:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు లేపాక్షి శ్రీ దుర్గాదేవి అమ్మవారు శ్రీ కాత్యాయిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఎం. వినయ్ ప్రతాప్ ప్రధాన పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ ప్రతాప్ మరియు తండ్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం. చలపతి, వారి కుటుంబ సభ్యులు, లేపాక్షి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న మండెంవారిపల్లి వాసులు

**నంబుల పూల కుంట అక్టోబర్ 14 మనం న్యూస్:** పార్టీ ఆదేశిస్తే పోటీకి సిద్ధం.. అవకాశం కోసం ఎదురుచూపులునంబులపూలకుంట: స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండెంవారిపల్లిలో సర్పంచ్ ఎన్నికలపై చర్చ మొదలైంది. పార్టీ ఆదేశిస్తే సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామానికి చెందిన పలువురు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న తమ గ్రామానికి ఈసారి ఎన్నికల్లో అవకాశం కల్పించాలని గ్రామానికి చెందిన కొందరు నాయకులు కోరుతున్నట్లు తెలిసింది. అయితే, సర్పంచ్ అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా ఎవరికి అవకాశం దక్కుతుంది? పార్టీ నిర్ణయం ఎలా ఉండబోతోంది? అన్న అంశాలపై గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. పార్టీ నిర్ణయంపై ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

## అమ్మవారు అనుగ్రహంతో అందరు సుఖశాంతులతో ఉండాలి

**–కుందుర్పిలో కొనసాగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు.**

**– 4వ రోజు మహా చండీ దేవిగా రూపంలో భక్తులకు దర్శనం.**



**కుందుర్పి, అక్టోబర్ 14, మనం న్యూస్:** అమ్మవారు అనుగ్రహంతో ప్రజలు అందరు సుఖశాంతులతో సంతోషంగా వుండాలని మహాచండి దేవి భక్తులు శరణు వేడుకున్నారు.కుందుర్పిలో కుందుర్పమ్మ,కనక దుర్గమ్మ,కన్యక పరమేశరి, కోదండ రామ స్వామి ఆలయంలో సీతాదేవి లు కు భక్తులు విశేష పూజలు చేపట్టి నైవేద్యం సమర్పించి నారు. కుందుర్పి మండల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగవ రోజు సందర్భంగా మంగళవారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారు మహా చండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాలను ముస్తాబు చేశారు. ఉదయం నుండి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నవరాత్రులలో 4వ రోజు మహా చండీ దేవిని పూజిస్తే శత్రు బాధలు తొలగి, సకల శుభాలు కలుగుతాయని తెలిపారు.తద్వార అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సూపర్‌వైజర్ బదిలీ

**– ఫిర్యాదుల నేపథ్యంలో నాగరాణి స్థానచలనం**

**గోరంట్ల, అక్టోబర్ 14: మనం న్యూస్:** గోరంట్ల మండలంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగరాణి బదిలీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మండలంలోని కొండాపురం, మందలపల్లి, పాలసముద్రం సెక్టార్లలో విధులు నిర్వహిస్తున్న ఆమెను పరిపాలనా కారణాలతో ఓబుళదేవరచెరువు మండల కేంద్రానికి బదిలీ చేస్తూ ఐసీడీఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి. మనోరంజని ఉత్తర్వులు జారీ చేశారు.సూపర్‌వైజర్ నాగరాణి తమను వేధిస్తున్నారంటూ గోరంట్ల ప్రాంతానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గత జులైలో పుట్టపర్తిలోని జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో పాటు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను అధికారులు పరిష్కరించాలని వారు కోరారు.అదేవిధంగా, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా నాగరాణిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడటం అంగన్వాడీ వర్గాల్లో చర్చకు దారితీసింది. అయితే, ఈ బదిలీకి అధికారికంగా పరిపాలనా కారణాలనే పేర్కొనగా, గతంలో సిబ్బంది చేసిన ఫిర్యాదులు, నిరసనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. బదిలీపై అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల్లో భిన్న చర్చలు సాగుతున్నాయి.